# ఏపీకి గేమ్‌చేంజర్.. మనకు డేంజర్!

I తరువాయి...

గమనార్హం. వరద జలాల ఆధారంగానే పోతిరెడ్డిపాడును చేపట్టినట్టు నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెప్పినట్టుగానే.. ఇప్పుడు చంద్రబాబు కూడా సముద్రంలోకి పోయే వృథా జలాలే బనకచర్లకు ఆధారమని చెప్తున్నారు. దీంతో గోదావరిలో తెలంగాణకు బనకచర్ల ప్రాజెక్టు మరో పోతిరెడ్డిపాడులా మారుతుందని స్పష్టమవుతున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరంపై అక్కసుతో మేడిగడ్డను రాజకీయ చట్రంలో ఇరికించిన సమయాన్ని చంద్రబాబు అదునుగా భావించి చక్రం తిప్పినట్టు స్పష్టమవుతుంది. ఇదే సమయంలో తమిళనాడులోని కావేరీ నదికి గోదావరిని అనుసంధానించేందుకు కాచుకుకూర్చున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా ఇదే మంచి తరుణంగా భావించి రంగంలోకి దిగింది. కొన్ని నెలల క్రితమే ఈ మేరకు వ్యూహ రచన జరిగినట్టు, అందులో భాగంగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్డీఎస్‌ఏ నివేదిక రూపంలో మేడిగడ్డ పునరుద్ధరణను అటకెక్కించినట్టు తెలుస్తున్నది. కాగా కేంద్రం-ఏపీ ప్రభుత్వం చెరి సగం నిధులతో బనకచర్లను పూర్తిచేసేందుకు అంతర్గతంగా నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అంతేకాకుండా, ఏపీ ప్రభుత్వం భరించే 50% నిధులను కూడా రుణ రూపంలో సేకరించేందుకు కేంద్రం సహకరించేలా అంగీకారం కూడా జరిగినట్టు సమాచారం. రాజు తలచుకుంటే.. అన్నట్టు కేంద్రమే బరిలో నిలవడంతో నిధుల సమీకరణ, అనుమతులు చకాచకా పూర్తి చేసుకొని తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాలు సైతం ఏపీ, తమిళనాడుల్లోని భూముల్లో పారేందుకు మార్గం సుగమమైనట్టు సాగునీటి రంగ నిపుణులు చెప్తున్నారు. కేవలం బనకచర్ల ప్రాజెక్టు కిందనే 200 టీఎంసీలు తరలించేందుకు ప్రణాళికను రూపొందించగా... కావేరీ అనుసంధానం తోడైతే గోదావరిలో తెలంగాణ పరిస్థితి అగమ్యగోచరంగా మారనున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకంగా రికార్డు సాధించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌పై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తున్న హైడ్రామా గుట్టు అధికారికంగా బట్టబయలైంది. మేడిగడ్డ పునరుద్ధరణను నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నివేదిక కారణంగా కాకుండా ఓ కుట్రలో భాగంగానే చేపట్టడంలేదని స్పష్టమవుతున్నది. గోదావరి-కావేరీ అనుసంధానంతో తమిళనాడుకు గోదావరి జలాలను తరలించాలని కొన్నేండ్లుగా ప్రయత్నించి విఫలమవుతున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడం అస్త్రంగా మారిందనేది రుజువైంది. చంద్రబాబు తిప్పుతున్న చక్రంతో కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బరాజ్‌ను కాలగర్భంలో కలిపే దిశగా అడుగులు వేస్తుండగా... ఆ మేరకు గోదావరి జలాలను తన్నుకుపోయేందుకు చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. ఇదే విషయాన్ని గత కొన్నిరోజులుగా 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. గుట్టు రట్టు కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలెవరూ దీనిపై నోరు విప్పడం లేదు. కానీ, ఏపీ సీఎం చంద్రబాబు ఎట్టకేలకు కుండబద్దలు కొట్టారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన తర్వాత మీడియా ముందుకు వచ్చిన బాబు.. బనకచర్ల గుట్టును మొత్తం విప్పారు. 200 టీఎంసీల గోదావరి జలాలను ఏపీలోని కృష్ణా, పెన్నా బేసిన్లకు తరలించేందుకు చేపట్టే ఈ పెద్ద ప్రాజెక్టును కేంద్రం-ఏపీ సంయుక్తంగా చేపట్టనున్నట్టు వెల్లడించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టులో తొలుత గోదావరి-కృష్ణాకు 200 టీఎంసీల జలాలను తరలించి, అక్కడి నుంచి బొల్లంపల్లి రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి నాగార్జునసాగర్ రైట్ కెనాల్ మీదుగా బనకచర్లకు తరలిస్తామని వెల్లడించారు. బనకచర్ల నుంచి దిగువన సోమశిల, కండలేరు రిజర్వాయర్లతోపాటు గాలేరు-నగరి సుజల స్రవంతి, హంద్రీ-నీవా సుజల స్రవంతి, తెలుగుగంగా... ఇలా అన్ని ప్రాజెక్టులకు కూడా గోదావరి జలాలు ఇస్తామన్నారు. దానికి రూ.80 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. ఒకవైపు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. మేడిగడ్డను పునరుద్ధరించకుండా గోదావరి జలాల వినియోగం తగ్గించగా... చంద్రబాబు మాత్రం తెలంగాణ కూడా ప్రాజెక్టులు కట్టుకుంటుందని చెప్పారు. ఇది ఏపీ భూభాగంలోనే (ఇంట్రా రివర్ ప్రాజెక్టు) చేపడుతున్న ప్రాజెక్టు కావడంతో ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. తాము అందరితోనూ మాట్లాడతామని, కేంద్రం కూడా మాట్లాడుతుందని చంద్రబాబు చెప్పడంతో కేంద్రం-ఏపీ సంయుక్తంగా బనకచర్లపై ఎలా ముందుకుపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



### పక్కా వ్యూహంతో ముందస్తుగానే పోలవరం విస్తరణ

జీబీ లింక్‌ను దృష్టిలో పెట్టుకునే పోలవరం ప్రాజెక్టును ఏపీ సర్కారు అనుమతులకు మించి ముందు నుంచే భారీగా విస్తరించుకుంటూ వస్తున్నది. కాలువల సామర్థ్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ పోతున్నది. వాస్తవంగా పోలవరం ప్రాజెక్టును నిర్మించాలని 1978లో ప్రణాళికలు రూపొందించింది. ఆ మేరకు డీపీఆర్‌ను నాటి బచావత్ ట్రిబ్యునల్ ఎదుట సమర్పించింది. ఆ వివరాల ప్రకారం 150 ఎఫ్ఆర్ఎల్‌తో పోలవరం వద్ద డ్యామ్‌ను నిర్మించాలి. ఎండీడీఎల్‌ను 145 అడుగులు కాగా, మొత్తం డ్యామ్ లైవ్ స్టోరేజీ 28.31 టీఎంసీలుగా ఉండాలి. కానీ, ఆచరణలో ఏపీ ప్రభుత్వం మాత్రం ట్రిబ్యునల్ అనుమతులకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు, కాలువ నిర్మాణ సామర్థ్యాలను మొదటి నుంచీ విస్తరించుకుంటూ పోతున్నది. ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యాలను విస్తరించింది. టీఏసీకి (టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ) సమర్పించే సమయంలో డ్యామ్ ఎండీడీఎల్‌ను 145 నుంచి 141 ఫీట్లకు కుదించింది. లైవ్ స్టోరేజీ కెపాసిటీని 28.31 నుంచి 75 టీఎంసీలకు పెంచింది. కాలువల సామర్థ్యాన్ని విస్తరించింది. కానీ, క్షేత్రస్థాయిలో ఆ పెంచిన సామర్థ్యాలకు విరుద్ధంగా కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మిస్తున్నది. అంతేకాదు రెండు కాలువల మార్గంలో ఉన్న సొరంగ మార్గాలను ఏకంగా మొదటి 40వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో ఏపీ నిర్మించడం నాడు విస్మయం కలిగించింది. కానీ పక్కా వ్యూహంతోనే గోదావరి బనకచర్ల ప్రాజెక్టును దృష్టిలో పెట్టుకునే ముందునుంచే ఏపీ పోలవరం ప్రాజెక్టును విస్తరించుకుంటూ పోతున్నదని తెలిసిపోతున్నది. అనుకున్న విధంగానే ఏపీ ప్రభుత్వం తాజాగా గోదావరి బనకచర్ల లింక్ పేరిట ఆయా కాలువలను మరింతగా విస్తరించేందుకు పూనుకున్నది. పోలవరం కుడి కాలువకు సమాంతరంగా 1,400 క్యూసెక్కుల సామర్థ్యంతో తాడిపూడి కాలువను 80 కి.మీ పొడవుతో ఇప్పటికే నిర్మించింది. ఆ కాలువను ప్రస్తుతం ప్రకాశం బరాజ్ వరకు అంటే 105 కి.మీ పొడగించడంతోపాటు కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని కూడా 1,400 క్యూసెక్కుల నుంచి 10 వేల క్యూసెక్కులకు విస్తరించాలని నిర్ణయించింది. అదేవిధంగా పోలవరం కుడికాలువ ప్రవాహ సామర్థ్యాన్ని కూడా 28 వేల క్యూసెక్కులతో ప్రస్తుతం చేపడుతున్నది. మొత్తంగా గోదావరి నుంచి రోజుకు నికరంగా 38 వేల క్యూసెక్కులు అంటే దాదాపు 3.5 టీఎంసీల జలాలను తరలించే అవకాశం ఉన్నది. ఇది ఏపీ ప్రభుత్వం కాగితాల మీద చెప్తున్న లెక్క. కానీ, ఆచరణలో రోజుకు దాదాపు 4 టీఎంసీలకు మించి జలాలను తరలించేందుకు వీలుగా పనులను నిర్వహిస్తున్నది. కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని కలిపితే మొత్తంగా రోజుకు 8 టీఎంసీలను ఏపీ తరలించే అవకాశమున్నది.

## పోలవరం డ్యామ్ వివరాలు

| వర్గం | ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం | 2009టీఏసీ నాటికి |
|---|---|---|
| డ్యామ్ ఎఫ్ఆర్ఎల్ | 150 ఫీట్లు | 150 ఫీట్లు |
| ఎండీడీఎల్ | 145 ఫీట్లు | 141 ఫీట్లు |
| గ్రాస్ రిజర్వాయర్ కెపాసిటీ | 194 | 194 టీఎంసీలు |
| లైవ్‌స్టోరేజీ | 28.31 | 74.85 టీఎంసీలు |

### గోదావరినే చెరబట్టే కుట్ర

వాస్తవంగా బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి గోదావరిలో 1,486 టీఎంసీలను కేటాయించింది. అందులో తెలంగాణ ప్రాజెక్టుకు సంబంధించి 968 టీఎంసీలు. ఏపీ వాటా 518 టీఎంసీలు. కానీ ఏపీ ప్రభుత్వం ఇప్పటికే తన వాటా పరిమితికి మించి దాదాపు 776 టీఎంసీలను వినియోగించుకునేందుకు అనుమతులు లేకుండా పలు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. ఇప్పుడు అదనంగా రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తంగా 200 టీఎంసీలను తరలిస్తామంటూ జీబీ లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు ఏపీ సిద్ధమైంది. కానీ, వాస్తవంగా 350 టీఎంసీలతో గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం పనులను ఏపీ సర్కారు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నది. పెన్నా బేసిన్‌లో ఇప్పటికే ఏపీకి ఆ మేరకు నీటినిల్వ సామర్థ్యం ఉండటం గమనార్హం. సోమశిల, కండలేరు, ఆవులపల్లి తదితర అనేక రిజర్వాయర్లను నిర్మించింది. పోతిరెడ్డిపాడు ద్వారా ఆయా రిజర్వాయర్లకు కృష్ణా జలాలను ప్రతిఏటా అక్రమంగా మళ్లిస్తూనే ఉన్నది. ఇప్పుడు గోదావరి జలాలను కూడా ఆ మేరకు పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఏపీ వేగంగా పావులు కదుపుతున్నది. ఏపీ చర్యల ఫలితంగా గోదావరి డెల్టా సిస్టమ్‌పై తీవ్ర ప్రభావానికి గురవుతుందని సాగునీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణకు జీవదాయిని అయిన ప్రాణహిత జలాలను కొల్లగట్టడమే లింక్ ప్రాజెక్టు అంతిమ లక్ష్యమని, ప్రాణహితలో సంవత్సరంలో 300 రోజులపాటు నికర వరద ప్రవాహాలు అందుబాటులో ఉండటాన్ని ప్రధాన ఆధారంగా చేసుకునే ప్రాజెక్టును చేపట్టిందని, రాష్ట్ర సాగునీటి రంగ నిపుణులు చెప్తున్నారు.


### జీబీలింక్‌కు కేంద్రం హామీ: చంద్రబాబు

ఏపీ ప్రభుత్వం రూ.80 వేల కోట్లతో చేపట్టనున్న గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని, ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చిందని, ఆ దిశగా తాము వర్క్‌ఔట్ చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో ఏపీ సీఎం శుక్రవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పలు ప్రాజెక్టులపై వినతిపత్రం సమర్పించిన అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి సంబంధిత వివరాలను వెల్లడించారు. ఏపీ ప్రభుత్వం రూ.80వేల కోట్లతో గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టనున్నదని వివరించారు. పనులకు కేంద్ర ప్రభుత్వం మొత్తంగా చేయాలని తాము కోరడం లేదని, అయితే కేంద్రం, ఏపీ కలిసి హ్యామ్ మోడల్‌లో పనులను చేపట్టేందుకు ఆమోదం తెలపాలని కోరామని వివరించారు. జీబీ లింక్ పెద్ద ప్రాజెక్టు అని, 200 టీఎంసీల మిగులు జలాలను గోదావరి నుంచి బనకచర్లకు తీసుకెళ్తే ఏపీకి అదొక గేమ్‌చేంజర్ అని వివరించారు. తొలుత గోదావరి జలాలను కృష్ణకు, అక్కడి నుంచి 150 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టనున్న బొల్లంపల్లి రిజర్వాయర్‌కు, ఆపై అక్కడి నుంచి బనకచర్లకు 200 టీఎంసీల గోదావరి జలాలను తరలిస్తామని తెలిపారు. తద్వారా సోమశిల, కండలేరు రిజర్వాయర్లకు, తిరుపతి బాలాజీసాగర్‌కు, జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్, తెలుగుగంగకు ఇలా అన్ని ప్రాజెక్టులకూ గోదావరి జలాలు ఇవ్వవచ్చని తెలిపారు. ఇది ఎవరికీ వ్యతిరేకం కాదని, తెలంగాణలో కూడా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని, అక్కడ మిగిలిన నీళ్లు ఇక్కడికి వస్తాయని తెలిపారు. జీబీ లింక్ అనేది ఇంట్రా రివర్ లింక్ ప్రాజెక్టుని, అభ్యంతరం చెప్పాల్సిన అవసరం ఏ రాష్ట్రానికీ లేదని, దానికి కూడా కేంద్రం సాయం కోరామని, అనుమతిస్తే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. 'వందేండ్ల సగటును తీసుకున్నా 2 వేల టీఎంసీలు సముద్రంలోకి కలుస్తున్నాయి. అలా సముద్రంలోకి పోయే 200 టీఎంసీల మిగులు జలాలను కరువు ప్రాంతాలకు తరలిస్తున్నాం. ఎవరికీ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. అందరితో మాట్లాడుతాం. అందరితో కలిసి ముందుకెళ్తాం. కేంద్రం కూడా అందరితో మాట్లాడుతానని హామీ ఇచ్చింది' అని వెల్లడించారు. కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్‌పాటిల్‌తో పోలవరంపై చర్చించానని, ప్రాజెక్టును 2027లోపు పూర్తి చేసేలా ప్రణాళిక ఉన్నదని వెల్లడించారు. వీలైనంత త్వరగా పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. పోలవరం నాణ్యతలో రాజీపడబోమని, రూ.400 కోట్లతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌ను గత ప్రభుత్వం దెబ్బతీసిందని, ఫలితంగా ప్రస్తుతం మళ్లీ రూ.980 కోట్లు పెట్టి కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నట్టు వెల్లడించారు.

## తెలంగాణకు నయాపైసా ఇవ్వకుండా...

**బనకచర్ల ప్రాజెక్టును రూ.80 వేల కోట్లతో చేపడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించగా... ఇందులో కేంద్రం కూడా సహకరిస్తుందని స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే దీనిపై కొంతకాలం కిందటే కేంద్రంలో నిర్ణయం జరిగినట్టుగా 'నమస్తే తెలంగాణ' ముందే చెప్పింది. కేంద్రం-ఏపీ 50:50 నిధుల్ని భరించేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. ఇందులో భాగంగా రూ.40వేల కోట్లను కేంద్రం సమకూర్చగా.. మిగిలిన రూ.40వేల కోట్లు ఏపీ భరించాల్సి ఉంటుంది.**

అయితే ఆ నిధులను కూడా రుణాల రూపంలో సమకూర్చేందుకు కేంద్రం సహకరించేందుకు సూత్రప్రాయంగా అంతర్గతంగా అంగీకారం జరిగినట్టు తెలిసింది. అందుకే చంద్రబాబు శుక్రవారం మీడియా సమావేశంలో హ్యామ్ మోడల్ పద్ధతిలో చేపట్టాలని కేంద్రాన్ని కోరామన్నారు. అంటే ఏపీ భరించాల్సిన నిధుల సమీకరణకు కూడా కేంద్రం పూర్తి స్థాయిలో సహకరించనున్నది. దీంతో ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చి సహకరించిన కేంద్రం.. ఇప్పుడు ఏకంగా రూ.80 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టుకు సైతం పూర్తిస్థాయి చేయూతను ఇవ్వనున్నది. కానీ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు మాత్రం మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు నయాపైసా విదిల్చలేదు. పైగా పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వాలని ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు.




## కృష్ణాలో మోసమే గోదావరిలో పునరావృతం

చెన్నై తాగునీటికి ఏటా కేవలం 15 టీఎంసీలు తరలించేందుకు చేపట్టిన తెలుగుగంగ ప్రాజెక్టు ఇంతింతై... ఏకంగా కృష్ణా నదినే మళ్లించుకుపోయే పోతిరెడ్డిపాడులా మారింది. జలయజ్ఞంలో భాగంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోతిరెడ్డిపాడును విస్తరించే సమయంలో ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ట్రిబ్యునల్ ముందు అభ్యంతరం వ్యక్తంచేశాయి. ఆ సమయంలోని వైఎస్ ప్రభుత్వం తాము కేవలం వరద జలాలపైనే ఆధారపడి ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్టు లిఖితపూర్వకంగా ట్రిబ్యునల్‌కు రాసి ఇచ్చింది. కానీ, కాలక్రమేణా అది తెలంగాణను ఎడారిగా మార్చింది. నాడు వరద జలాలు అన్న పోతిరెడ్డిపాడు ఇప్పుడు హక్కులా ఏటా వందల టీఎంసీల కృష్ణా నదిని మళ్లించుకుపోయే స్థితికి చేరింది. అయితే బనకచర్ల విషయంలోనూ చంద్రబాబు శుక్రవారం అదే విషయాన్ని పునరుద్ఘాటించారు. సముద్రంలో కలిసే రెండువేల టీఎంసీల్లో 200 టీఎంసీల గోదావరిజలాలనే తాము మళ్లిస్తున్నామని చెప్పారు. కానీ, 200 టీఎంసీలు గోదావరికి భారీ వరదలు ఉన్న సమయంలో తరలించడం అసాధ్యమనేది చంద్రబాబుకు కూడా తెలుసు. గోదావరిలో సాధారణ ఇన్‌ఫ్లోలు ఉన్న సమయంలో కూడా ఆ 200 టీఎంసీల్లో భాగమేనంటూ నీటిని తన్నుకుపోతారు. అయితే ఇక్కడ కావేరీ అనుసంధాన ప్రాజెక్టు రూపంలో మరో ముప్పు కూడా ముందుకు రాబోతున్నది. తెలంగాణ గడ్డపై నుంచి కాకుండా ఏపీలోని పోలవరం నుంచి కావేరీకి గోదావరి జలాలను తరలించేందుకు కేంద్రం స్కెచ్ వేసింది. బనకచర్ల ప్రాజెక్టు కొలిక్కిరాగానే కేంద్రం వెంటనే కావేరీ అనుసంధాన ప్రాజెక్టును తెరపైకి తేనున్నట్టు తెలిసింది. బనకచర్లకు సహకరించిన దరిమిలా చంద్రబాబు కూడా ఏపీ భూభాగం నుంచి గోదావరిని తమిళనాడుకు తరలించే కేంద్ర ప్రాజెక్టుకు సహకరించనున్నారు. తద్వారా రెండు జాతీయ ప్రాజెక్టులను ట్రిబ్యునల్ ముందు ఉంచి ఏపీ హక్కులు పొందే కీలకమైన ప్రమాదం తెలంగాణకు చేరువలోనే ఉన్నదని సాగునీటి రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# సీఎం సోదరుల పేరుతో బెదిరింపు

మొదటిపేజీ తరువాయి...

దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన పాలాది చంద్రమౌళీశ్వర్ మహబూబ్‌నగర్ జిల్లా, మహబూబ్‌నగర్ అర్బన్ మండలం పాల్‌కొండ గ్రామ శివారులోని సర్వే నంబర్ 272/1లో 7 ఎకరాల 30 గుంటల భూమిని 1988లో తన కుమారుల కోసం కొనుగోలు చేశారు. ఆయన చనిపోయిన తర్వాత 2023లో జడ్చర్లకు చెందిన శివలింగం అనే వ్యక్తికి ఆ భూమిని విక్రయించేందుకు చంద్రమౌళీశ్వర్ భార్య కళావతి, కుమారులు శ్రీనివాస్, రాంబాబు ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం 2024 మే 8న వారికి ఆ భూమిలో 51 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఆ అగ్రిమెంట్‌లో కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రాజు పేరును శివలింగం చేర్చారు. రాఘవేందర్‌రాజు ఎవరో వారికి అప్పటికి తెలియదు. ఆ తర్వాత ఒప్పందం ప్రకారం రూ. 50 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ. 30 లక్షలు మాత్రమే ఇచ్చి మొత్తం ఇచ్చినట్టు ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. అంతేకాదు, ప్లాట్లకు పోగా మిగిలిన మూడెకరాల భూమిని సైతం తమకే ఇవ్వాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రాజు

### సీఎం సోదరులతో నాకు పరిచయం

తమకు రాజకీయంగా ఎలాంటి అండదండలు లేవని గుర్తించిన రాఘవేందర్‌రాజు ఉన్న మూడెకరాలను గుంజుకునేందుకు పంతం పట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అండ చూసుకొని రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించకపోతే చంపేస్తానని నేరుగా బెదిరిస్తున్నట్టు తెలిపారు. 'సీఎం సోదరులతో నాకు బాగా పరిచయం ఉంది. రాష్ట్ర స్థాయిలో బాగా పలుకుబడి ఉన్న నేతను నేను. ఏం చేసినా నన్ను అడిగే వారు లేరు. మిగిలిన 3 ఎకరాల భూమిని నాకే ఇవ్వాలి. లేదంటే మీరు డబ్బులు తీసుకున్న ఫొటోలు, వీడియోలు నా దగ్గర ఉన్నాయి. మీ అంతు చూస్తా' అంటూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఆ మూడెకరాలను ఎవరికైనా విక్రయించుకోవచ్చని సామ శివలింగం, అతడి మరో పార్టనర్ సురేశ్ కూడా చెప్పారని, వారి ఇష్ట ప్రకారం గతేడాది సెప్టెంబర్ 3న సరెండర్ అండ్ భరోసా పత్రాన్ని రాసి ఇచ్చారని మానవ హక్కుల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### 'ఎవరికి చెప్పినా చంపేస్తాం'

'మూడెకరాల భూమికి ఒక్క పైసా ఇవ్వం. ఫ్రీగా రిజిస్ట్రేషన్ చెయ్యాలి. మళ్లీ వారం తరువాత పిలుస్తాం. వచ్చి మాకు రిజిస్ట్రేషన్ చేసి వెళ్లి పోవాలి. ఈ విషయాన్ని బయట ఎక్కడైనా చెప్తే, రాష్ట్రంలో ఏ మూలన ఉన్నా మిమ్మల్ని చంపేస్తాం' అని సీఐ గాంధీనాయక్, ఎస్సై విజయ్‌కుమార్, చలువగాలి రాఘవేందర్‌రాజు భయపెట్టారని బాధితులు బోరున విలపించారు. ఆ తరువాత పోలీసులు వారికి అనుకూలంగా స్టేట్‌మెంట్‌లు రాసుకొని తమ చేత సంతకాలు తీసుకొని బెదిరించి పంపారని పేర్కొన్నారు. ఆ రోజు నుంచి తాము ప్రాణభయంతో ఇల్లు వదిలి వేరే చోట తలదాచుకుంటున్నట్టు తెలిపారు. తమకు రూ. 2.5 కోట్లు ఇచ్చామని తప్పుడు ప్రచారం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్, ఎస్సై విజయ్‌కుమార్, చలువగాలి రాఘవేందర్‌రాజు, ఆయన డ్రైవర్ శివగౌడ్, సురేశ్, సామ శివలింగంపై చట్టపరమైన చర్య తీసుకోవాలని మానవహక్కుల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంపై ఇటీవల డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేసినా పోలీసుల ఆగడాలు తగ్గడం లేదని వాపోయారు. మొదటి నుంచి తమను బెదిరించి, చంపేస్తామని అంటున్న సీఐ గాంధీనాయక్, ఎస్సై విజయ్ కుమార్‌కు ఉత్తమ పోలీస్ అవార్డులు ఎలా ఇస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

## స్టేషన్‌లోనే సంతకాలు పెట్టించిన పోలీసులు

సివిల్ తగాదాల్లో పోలీసులు తలదూర్చవద్దని సాక్షాత్తూ డీజీపీ జితేందర్ పలుమార్లు హెచ్చరించినా కొందరు పోలీసులు ఆయన మాటలు బేఖాతరు చేస్తున్నారని బాధితులు తెలిపారు. రాఘవేందర్‌రాజుపై బాధితులు పలుమార్లు మహబూబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు.. ఈ నెల 2న ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ వచ్చి తమను బలవంతంగా కారులో మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్టు వారు పేర్కొన్నారు. అక్కడ సీఐ గాంధీనాయక్, ఎస్సై విజయ్‌కుమార్‌తోపాటు రాఘవేందర్‌రాజు తన కుమారుడిని ఉదయం నుంచి సాయంత్రం వరకు చిత్రహింసలు పెట్టారని కళావతి కన్నీటి పర్యంతమయ్యారు. 'విరాసత్ కోసం వేలిముద్ర వెయ్యకుంటే నీ కుమారుడిని చంపేస్తం' అని పోలీసుల సమక్షంలోనే రాఘవేందర్‌రాజు భయపెట్టినట్టు ఆరోపించారు. ఆ తర్వాత రాఘవేందర్‌రాజు కారు డ్రైవర్ శివగౌడ్ కారులో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి, తన చేత బలవంతంగా వేలిముద్రలు వేయించారని, రాత్రి 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తన కొడుకును భయపెట్టారని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు.

# మా ఆదేశాలే బేఖాతరు చేస్తరా?



## భూ వివాదంలో సొంత విచక్షణ వద్దు!

- కాంగ్రెస్ పెద్దల భూ కబ్జాకు సహకరిస్తున్న పోలీసుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- కోర్టు ఆదేశాల బేఖాతరుపై మండిపాటు
- వైవీ స్వర్ణలత పిటిషన్‌పై విచారణ
- చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీసులకు ఆదేశం

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): భూ వివాదంలో తమ ఆదేశాలను బేఖాతరు చేసిన సైబరాబాద్ పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తున్నట్టు తెలిసి కూడా పోలీసులు కొందరికి అనుకూలంగా వ్యవహరించడం ఏమిటని మండిపడింది. భూ వివాదంలో మీ సొంత విచక్షణ అవసరం లేదని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ సర్వే నంబరు 87/2లో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సుమారు రూ.200 కోట్లకు పైగా విలువైన 2.08 ఎకరాల భూమి ఉంది. రెవెన్యూ రికార్డులో సుబ్బారెడ్డి భార్య వైవీ స్వర్ణలతారెడ్డి పేరిట ఈ భూమి నమోదైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూమి తమదంటూ ప్రభుత్వ పెద్దల్లో ఒకరికి సన్నిహితులైన జీ నర్సింహారెడ్డి, షేక్ ఇస్లాముద్దీన్, కొప్పుల మల్లారెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించే ప్రయత్నం చేశారు. దీంతో స్వర్ణలతారెడ్డి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ, వారు ఆ ఫిర్యాదును బుట్టదాఖలు చేశారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించి ఆ భూమిలోకి ఎవరూ ప్రవేశించకుండా హైకోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకున్నారు. అయినప్పటికీ సదరు వ్యక్తులు తమ అధికార ప్రాబల్యాన్ని ఉపయోగించి హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించేందుకు ప్రయత్నించారు. దీంతో స్వర్ణలతారెడ్డి మరోమారు హైకోర్టును ఆశ్రయించారు.

### డీసీపీ, ఏసీపీపై చర్యలు తీసుకోండి

కొండాపూర్‌లోని సర్వే నంబర్ 87/2లోని 6.23 ఎకరాల చుట్టూ ఉన్న రెండెకరాల వివాదంలో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని స్వర్ణలతారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పక్షపాతంతో వ్యవహరిస్తున్న మాదాపూర్ డీసీపీ, ఏసీపీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జే శ్రీనివాస్‌రావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వినోద్ కుమార్ దేశ్‌పాండే, రోహిత్ పోగుల వాదనలు వినిపించారు. ప్రభావవంతమైన వ్యక్తులతో సంబంధాలున్న ప్రైవేట్ వ్యక్తులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని వాదించారు. కాంపిటెంట్ కోర్టు పిటిషనర్‌కు అనుకూలంగా ఇంజక్షన్ ఉత్తర్వులు జారీచేసిందని, హైకోర్టు కూడా ప్రైవేట్ వ్యక్తి అప్పీల్‌ను తోసిపుచ్చిందని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, భూమిని స్వాధీనం చేసుకోవడానికి వారికి మద్దతు ఇస్తున్నారని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రైవేట్ పార్టీని ఆదేశిస్తూ, విచారణను జూన్‌కు వాయిదా వేశారు.

## చట్టాన్ని పాటించాల్సిందే

స్వర్ణలతారెడ్డి పిటిషన్‌ను విచారించిన హైకోర్టు చట్టాన్ని పాటించాలని పోలీసులను ఆదేశించింది. కాంపిటెంట్ కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఉత్తర్వులను పాటించకుంటే తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఉత్తర్వులను ఉల్లంఘించినట్టు స్పష్టంగా తెలుస్తున్నప్పుడు పోలీసులు సొంత విచక్షణతో వ్యవహరించలేరని తేల్చిచెప్పింది. పిటిషనర్ ఫిర్యాదును పరిశీలించి, చట్టప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది.